RNI.NO. TGBIL/26/A0701

# తొలిప్రభ

తెలుగు దినపత్రిక

WWW.toliprabha.com

హైదరాబాద్ | ఆదివారం 25.10.2026 | సంపుటి:1 | సంచిక:227 | పేజీలు:6 | వెల:రూ.5




## రాజీవ్‌ను చూడగానే జీవిత భాగస్వామి అనుకున్నా!

- కేంబ్రిడ్జ్‌లోని గ్రీకు రెస్టారెంట్‌లో తొలి పరిచయం
- కామన్ ఫ్రెండ్ ద్వారా మొదలైన స్నేహం
- రాజీవ్ సున్నిత మనస్తత్వం ఆకర్షించింది
- ప్రేమ ప్రయాణంపై సోనియా గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు
- నవంబరు 10న 'బిలాంగింగ్' ఆత్మకథ ఆవిష్కరణ
- ఎక్స్ ఖాతాలో వీడియో పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత




**తొలిప్రభ, న్యూఢిల్లీ:**

దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తన ప్రేమ ప్రయాణం ఎలా మొదలైందో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులుగా ఉన్న సమయంలో అక్కడి గ్రీకు రెస్టారెంట్‌లో రాజీవ్‌తో తనకు తొలి పరిచయం ఏర్పడిందని తెలిపారు. తాజాగా ఎక్స్ ఖాతాను ప్రారంభించిన సోనియా.. అందులో ఓ వీడియోను

మిగతా 2లో

## ఆరు నెలల్లో రూ.15 వేల కోట్ల రెవెన్యూ లోటు

- లక్ష్యానికి దూరంగా రాష్ట్ర ఆదాయ రాబడులు
- సెప్టెంబరు చివరికి వచ్చిన ఆదాయం రూ.92,013 కోట్లు
- పన్నుల ద్వారా సమకూరింది రూ.82,553 కోట్లు
- కేంద్ర గ్రాంట్ల రూపంలో అందింది రూ.3,706 కోట్లే
- ఆరు నెలల్లో రూ.44,612 కోట్ల అప్పుల సమీకరణ
- రూ.1.34 లక్షల కోట్లకు చేరిన ప్రభుత్వ వ్యయం

2



# తుమ్మిడిహట్టిపై చర్చలకు ముహూర్తం ఖరారు

- సోమవారం ముంబయిలో ఫడణవీస్‌తో రేవంత్ భేటీ
- సీఎం వెంట మంత్రి ఉత్తమ్, నీటిపారుదల శాఖ అధికారులు
- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి పట్టుబట్టనున్న తెలంగాణ
- తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు రూట్ డిజైన్లపై కసరత్తు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌పై ఉత్తమ్ విమర్శలు

**తొలిప్రభ, హైదరాబాద్:**

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యారేజీ ఎత్తు,

మిగతా 2లో




### ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ జోరు!

- మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాలపై పార్టీ గురి
- ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో 21 మంది అభ్యర్థులు
- విజయావకాశాలున్న వార్డులకే పరిమితమైన పోటీ

2




### కివీస్‌పై రెండో టీ20లో టీమిండియా గెలుపు!

- ఉత్కంఠ పోరులో భారత్‌దే విజయం
- తిలక్ వర్మ అర్ధ సెంచరీతో అదరగొట్టిన వైనం
- నితీశ్ రెడ్డి దూకుడుతో లక్ష్యం సునాయాసం

2

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం!

- నకిలీ పీజీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు.. 35 మంది తొలగింపు
- కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అయిన అధ్యాపకులపై పరిశీలన
- ఇంకా 700 నుంచి 800 మంది ధ్రువపత్రాల తనిఖీ
- ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి వివరాల సేకరణ
- అధికారుల సంతకాలతో నకిలీ ధ్రువీకరణ లేఖల సమర్పణ
- డిసెంబరు నాటికి ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను సమర్పించి రెగ్యులర్ ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించే ప్రక్రియను ఇంటర్మీడియట్ బోర్డు ముమ్మరం చేసింది.

2



## జిలెటిన్ స్టిక్స్ పేలి ఐదుగురి దుర్మరణం!

- అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- పినకోట వద్ద టిప్పర్ దూసుకెళ్లడంతో పేలుడు
- డ్రైవర్, ముగ్గురు కార్మికులు, టీచర్ మృతి
- కొండను తొలిచేందుకు అమర్చిన జిలెటిన్ స్టిక్స్
- నిర్వాహకుల నిర్లక్ష్యంపై పోలీసుల దర్యాప్తు



**తొలిప్రభ, అల్లూరి జిల్లా:**

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రహదారి నిర్మాణ పనుల కోసం కొండను తొలిచేందుకు అమర్చిన జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. శనివారం ఉదయం అనంతగిరి మండలం పినకోట వద్ద ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పనుల కోసం జిలెటిన్ స్టిక్స్ అమర్చిన విషయం తెలియక టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపించాడు. అదే సమయంలో పేలుడు సంభవించడంతో టిప్పర్ ఒక్కసారిగా ఎగిరిపడింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్‌తో పాటు వాహనంలో ఉన్న ముగ్గురు కార్మికులు, ఒక ఉపాధ్యాయుడు దుర్మరణం పాలయ్యారు. మరికొందరు గాయపడగా, వారి వివరాలు తెలియాల్సి ఉంది. రహదారి నిర్మాణంలో భాగంగా కొండను తొలిచేందుకు

మిగతా 2లో

## పాశమైలారంలో డ్రగ్స్ ముడిసరుకు తయారీ కేంద్రం!



- ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల మెరుపు దాడులు
- ఎండీఎంఏ తయారీకి కీలకమైన రసాయనం గుర్తింపు
- రూ.27 లక్షల విలువైన 44.699 కిలోల పొడి స్వాధీనం
- యూనిట్ నిర్వాహకుడు రమేష్ బాబు సాకే అరెస్ట్

## తుక్కు వ్యాపారంలో జీఎస్టీ ఎగవేతల దందా!

### స్క్రాప్ అక్రమ రవాణాతో రాష్ట్ర ఖజానాకు భారీ గండి

- ఏటా రూ.వెయ్యి కోట్ల అదనపు ఆదాయానికి అవకాశం
- అసంఘటిత రంగంలో స్క్రాప్ సేకరణ.. పర్యవేక్షణ కష్టం
- టన్ను రాగి ధర రూ.14 లక్షలు దాటడంతో డిమాండ్
- ఇతర రాష్ట్రాల పేరుతో బోగస్ ఐటీసీల దాఖలు
- దేశవ్యాప్తంగా కేంద్రీకృత వ్యాపార వ్యవస్థకు తెలంగాణ ప్రతిపాదన

తుక్కు వ్యాపారంలో అక్రమ రవాణా, విక్రయాల ద్వారా వ్యాపారులు కోట్లాది రూపాయల జీఎస్టీని ఎగవేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు గణనీయమైన ఆదాయ నష్టం వాటిల్లుతోంది.



**తొలిప్రభ, హైదరాబాద్:**

రాష్ట్రంలో స్క్రాప్ సేకరణ, కొనుగోళ్లు, విక్రయాల ప్రక్రియలో ఎక్కువ భాగం అసంఘటిత రంగంలోనే సాగుతుండటంతో పర్యవేక్షణ అధికారులకు కష్టంగా మారింది. కార్మికులు వీధుల్లో తిరుగుతూ పాత వస్తువులు, లోహాల తుక్కును సేకరించి టోకు వ్యాపారులకు విక్రయిస్తారు. అక్కడి నుంచి ఈ తుక్కు వివిధ ఉత్పత్తులను తయారు

మిగతా 2లో

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో

# నకిలీ సర్టిఫికెట్ల కలకలం!

**తొలిప్రభ, హైదరాబాద్:**

ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు నిర్ధారణ కావడంతో 35 మందిని తొలగించిన బోర్డు.. మిగిలిన అధ్యాపకుల ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అధ్యాపకులు సమర్పించిన మార్కుల శాతాలను కూడా పరిశీలించాలని భావిస్తోంది. రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 నుంచి 2014 మధ్య వివిధ విడతల్లో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులుగా చేరారు. 2013 మేలో అప్పటి ప్రభుత్వం వీరి పోస్టులను క్రమబద్ధీకరించడంతో సుమారు 3,800 మంది శాశ్వత జూనియర్ లెక్చరర్లుగా మారారు. వీరిలో పలువురు బిహార్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల నుంచి పీజీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు ఆరోపణలున్నాయి. సరైన ధ్రువీకరణ లేకుండానే అధికారులు వాటిని ఆమోదించి నియామక ఉత్తర్వులు జారీ చేశారనే విమర్శలు వచ్చాయి. అప్పటి నుంచి కొనసాగుతున్న సర్టిఫికెట్ల సమీక్షను, ప్రొబేషన్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో బోర్డు వేగవంతం చేసింది. పత్రాల నిజానిజాలను నిర్ధారించేందుకు ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు అధికారులను పంపించి వివరాలు సేకరిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల 35 మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ప్రస్తుతం మరో 700 నుంచి 800 మంది అధ్యాపకుల ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. వీరిలో ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు చెందిన సర్టిఫికెట్లు సమర్పించిన వారు సుమారు 400 మంది వరకు ఉన్నట్లు అంచనా. తెలంగాణలోని విశ్వవిద్యాలయాలకు చెందిన సర్టిఫికెట్ల విషయంలో సంబంధిత అధికారులను సంప్రదించడంతో పాటు పోలీసుల నుంచి కూడా నివేదికలు తీసుకుంటున్నారు. ఈ మొత్తం ధ్రువీకరణ ప్రక్రియను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది. క్రమబద్ధీకరణ అనంతరం తమ పీజీ సర్టిఫికెట్లు అసలైనవేనని నిర్ధారిస్తూ సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి లిఖితపూర్వక ధ్రువీకరణ లేఖలు తీసుకురావాలని బోర్డు గతంలో ఆదేశించింది. అధ్యాపకులు సమర్పించిన ఈ లేఖల్లోనూ పదుల సంఖ్యలో నకిలీవి ఉన్నట్లు సమాచారం. కొందరు విశ్వవిద్యాలయ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి లేఖలు సమర్పించినట్లు తెలుస్తోంది. ఒక అధ్యాపకుడు ఇచ్చిన లేఖలో పేర్కొన్న కోర్సు, ఆయన చదివినట్లు తెలిపిన సంవత్సరంలో ఆ విశ్వవిద్యాలయంలో అందుబాటులో లేదని సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల నుంచి పీజీ పూర్తి చేసిన వారిలోనూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచి చూపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొన్ని విశ్వవిద్యాలయాలు మార్కుల శాతాన్ని పేర్కొనకుండా కేవలం ఉత్తీర్ణులైనట్లు మాత్రమే ధ్రువీకరించడం గమనార్హం. నకిలీ సర్టిఫికెట్లపై దర్యాప్తు పూర్తయిన తర్వాత మార్కుల శాతాలపైనా పరిశీలన చేపడతామని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. మోసపూరితంగా నకిలీ పత్రాలు సమర్పించి ఉద్యోగాల్లో చేరిన వారు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగితే వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నట్లు సమాచారం.

## తుమ్మిడిహట్టిపై చర్చలకు

# ముహూర్తం ఖరారు

**తరువాయి భాగం**

నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే ప్రాజెక్టు మార్గ రూపకల్పన, భూసేకరణ అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదే రోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి భేటీ ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విజ్ఞప్తికి స్పందించిన బోర్డు సమావేశాన్ని మంగళవారానికి మార్చింది. కాగా, రాష్ట్ర ప్రజల కష్టాలకు బీఆర్ఎస్ పాలనే కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వినియోగం వల్లే సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. బ్యారేజీల గేట్లు మూయవద్దని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచించిందని, గేట్లు మూయకపోతే పంపుల నిర్వహణ సాధ్యం కాదని అన్నారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయడంపై బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బ్యారేజీల నిర్మాణానికి వినియోగించినంత కాంక్రీటు మరమ్మతులకూ అవసరమవుతోందని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు.

## రాజీవ్‌ను చూడగానే జీవిత భాగస్వామి అనుకున్నా!

**తరువాయి భాగం**

పంచుకున్నారు. తన ఆత్మకథ 'బిలాంగింగ్' గురించి వివరిస్తూ, నవంబరు 10న ఆ పుస్తకం ఆవిష్కరణ కానున్నట్లు చెప్పారు. రాజీవ్‌తో తన పరిచయం, స్నేహం, ప్రేమకు సంబంధించిన జ్ఞాపకాలను అందులో పొందుపరిచినట్లు వెల్లడించారు. విద్యార్థులుగా ఉన్న రోజుల్లో రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోలను కూడా పుస్తకంలో చేర్చినట్లు తెలిపారు. ఆ రోజుల్లో ఇంగ్లండ్‌లో ఆహారం అంతగా నచ్చకపోవడంతో ఇటాలియన్ వంటకాల కోసం గ్రీకు రెస్టారెంట్‌కు వెళ్లేదాన్నని చెప్పారు. అక్కడ యూరప్‌తో పాటు భారత్‌కు చెందిన విద్యార్థులు కూడా వచ్చేవారని, అదే చోట రాజీవ్ తనకు పరిచయమయ్యారని వివరించారు. తొలిసారి ఓ ఉమ్మడి స్నేహితుడు తమ ఇద్దరినీ పరిచయం చేశారని సోనియా తెలిపారు. ఆ తర్వాత స్నేహితులుగా మారామని, ఇతర స్నేహితులతో కలిసి పార్టీలకు వెళ్లేవారమని చెప్పారు. విద్యార్థులతో కలిసి ఓసారి వాలెంటైన్స్ పార్టీకి కూడా వెళ్లినట్లు గుర్తు చేసుకున్నారు. రాజీవ్ గాంధీలోని సున్నితమైన మనస్తత్వం తనను ఎంతగానో ఆకర్షించిందని పేర్కొన్నారు. రాజీవ్‌ను చూడగానే తన జీవిత భాగస్వామి దొరికినట్లు భావించానని, ఆయనకు కూడా తన పట్ల అలాంటి అభిప్రాయమే కలిగిందని సోనియా వెల్లడించారు. సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ 1968 ఫిబ్రవరి 25న వివాహం చేసుకున్నారు. గురువారమే సోనియా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా ఎక్స్‌లోనూ ఖాతా తెరిచి తన జీవితంలోని వ్యక్తిగత జ్ఞాపకాలను వీడియో రూపంలో పంచుకున్నారు.

## ఆరు నెలల్లో రూ.15 వేల కోట్ల రెవెన్యూ లోటు

**తొలిప్రభ, హైదరాబాద్:**

202627 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరకపోవడంతో రూ.15,096 కోట్ల రెవెన్యూ లోటు నమోదైంది. పన్ను రాబడులు లక్ష్యానికి దూరంగా ఉండగా, ప్రభుత్వ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. కాగ్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది రూ.2,41,263 కోట్ల రెవెన్యూ ఆదాయం వస్తుందని అంచనా వేయగా, సెప్టెంబరు చివరి నాటికి రూ.92,013 కోట్లు మాత్రమే సమకూరాయి. ఇది బడ్జెట్ అంచనాల్లో సుమారు 38 శాతం. పన్నుల ద్వారా రూ.1,81,367 కోట్లు వస్తాయని అంచనా వేయగా, రూ.82,553 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇందులో జీఎస్టీ ద్వారా రూ.29,565 కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా రూ.18,830 కోట్లు, ఎక్సైజ్ ద్వారా రూ.10,471 కోట్లు, స్టాంపులురిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9,033 కోట్లు సమకూరాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.10,667 కోట్లు, ఇతర పన్నుల ద్వారా రూ.3,985 కోట్లు వచ్చాయి. ఆగస్టులో రూ.16 వేల కోట్లకు పైగా ఉన్న పన్ను ఆదాయం సెప్టెంబరులో రూ.13 వేల కోట్లకు తగ్గింది. పన్నేతర ఆదాయం ద్వారా ఏడాదికి రూ.35,730 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆరు నెలల్లో రూ.5,754 కోట్లు మాత్రమే సమకూరాయి. కేంద్ర గ్రాంట్ల రూపంలో రూ.24,166 కోట్లు వస్తాయని భావించగా, రూ.3,706 కోట్లు మాత్రమే అందాయి. మరోవైపు ప్రభుత్వం రుణాల ద్వారా రూ.44,612 కోట్లు సమీకరించింది. ఈ ఏడాది ప్రతిపాదించిన రూ.61,457 కోట్ల అప్పుల్లో ఇప్పటికే 72 శాతం మేర తీసుకుంది. అన్ని మార్గాల్లో కలిపి రాష్ట్రానికి రూ.1,36,648 కోట్ల ఆదాయం సమకూరగా, మొత్తం వ్యయం రూ.1,34,852 కోట్లకు చేరింది. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1,07,109 కోట్లు, మూలధన వ్యయం రూ.27,743 కోట్లు. సెప్టెంబరులోనే మూలధన వ్యయం కింద రూ.15,251 కోట్లు ఖర్చు చేశారు. ఉద్యోగుల జీతాలకు రూ.25,258 కోట్లు, పింఛన్లకు రూ.14,235 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.16,565 కోట్లు, రాయితీలకు రూ.10,298 కోట్లు వెచ్చించారు. రెవెన్యూ రాబడులను మించి వ్యయం నమోదవడంతో రూ.15,096 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది. ఆర్థిక లోటు రూ.44,612 కోట్లుగా, ప్రాథమిక లోటు రూ.28,046 కోట్లుగా ఉన్నట్లు కాగ్ నివేదిక వెల్లడించింది.

## తుక్కు వ్యాపారంలో జీఎస్టీ ఎగవేతల దందా!

**తరువాయి భాగం**

చేసే కంపెనీలకు చేరుతుంది. అయితే తుక్కు సేకరణ, మధ్యంతర కొనుగోళ్లు, విక్రయాల దశల్లో పన్ను చెల్లింపులు సక్రమంగా జరగడం లేదని అధికారులు గుర్తించారు. తుది ఉత్పత్తులను మార్కెట్లో విక్రయించే సమయంలో మాత్రమే జీఎస్టీ చెల్లిస్తున్న సందర్భాలున్నట్లు చెబుతున్నారు. స్క్రాప్‌ను రవాణా చేసే వాహనాలను వాణిజ్య పన్నులశాఖ అధికారులు తనిఖీల్లో పట్టుకున్నప్పుడు, వాటిపై జీఎస్టీ చెల్లింపులకు సంబంధించిన రసీదులు ఉండటం లేదని పేర్కొంటున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడం సాధ్యం కాకపోవడంతో అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవడం కష్టమవుతోంది. ఇతర రాష్ట్రాల పేర్లతో రవాణా సాగుతుండటం కూడా పర్యవేక్షణకు ఆటంకంగా మారింది. కొన్ని లోహాల ధరలు అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతుండటంతో వాటి తుక్కుకు భారీ డిమాండ్ ఏర్పడింది. టన్ను రాగి ధర రూ.14 లక్షలు దాటిందని, ఏడాది క్రితంతో పోలిస్తే 44 శాతం పెరిగిందని సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రాగి తుక్కును ఎక్కువగా సేకరించేందుకు టోకు వ్యాపారులు కార్మికులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇనుము, బ్యాటరీల్లో వినియోగించే సీసం తదితర లోహాల తుక్కుకూ మార్కెట్లో గిరాకీ అధికంగా ఉంది. ఈ వ్యాపారాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, చిన్నస్థాయి కార్మికులే పట్టుబడుతున్నారని, పన్ను ఎగవేతల ద్వారా అధిక లాభాలు పొందుతున్న ప్రధాన వ్యాపారులు చాలాసార్లు తప్పించుకుంటున్నారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో తుక్కు అక్రమ వ్యాపారం, జీఎస్టీ ఎగవేతలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ తాజాగా కోరింది. తుక్కు కొనుగోళ్లపై 18 శాతం జీఎస్టీ వర్తిస్తున్న నేపథ్యంలో, పన్ను చెల్లించకుండానే కొనుగోళ్లు జరిపి, వస్తువుల తయారీ జరిగినట్లు చూపిస్తూ బోగస్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లను దాఖలు చేస్తున్నట్లు కేంద్రానికి వివరించింది. తుక్కు వ్యాపారంలో అక్రమాలను అరికట్టగలిగితే రాష్ట్రానికి ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల అదనపు జీఎస్టీ ఆదాయం సమకూరుతుందని సీనియర్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇతర రాష్ట్రాల పేర్లతో తుక్కు కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన ఐటీసీలు దాఖలు చేస్తుండటంతో స్థానికంగా తనిఖీలు నిర్వహించి అక్రమాలను గుర్తించడం కష్టమవుతోందని చెబుతున్నారు.

## పాశమైలారంలో డ్రగ్స్ ముడిసరుకు తయారీ కేంద్రం!

**తొలిప్రభ, సంగారెడ్డి:**

తెలంగాణలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్స్ ముడిసరుకు తయారీ కేంద్రాన్ని ముంబై క్రైమ్ డిటెక్షన్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని ఐడీఏ పాశమైలారంలో ఉన్న ఓ పరిశ్రమపై స్థానిక పటాన్‌చెరు పోలీసుల సహకారంతో ముంబై బృందాలు ఆకస్మికంగా దాడులు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఎండీఎంఏ (మిథైలీన్ డయాక్సీ మెథాంఫెటమైన్) డ్రగ్స్ తయారీలో కీలకమైన '2బ్రోమో 4మిథైల్ ప్రొపియోఫినోన్' రసాయన పొడిని తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పరిశ్రమ నుంచి సుమారు రూ.27 లక్షల విలువైన 44.699 కిలోల రసాయన పొడితో పాటు, తయారీకి ఉపయోగించే ఇతర ద్రవ రసాయనాలు, ప్రయోగశాల యంత్ర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ తయారీ కేంద్రం నిర్వాహకుడు రమేష్ బాబు సాకేను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా విస్తరించిన డ్రగ్స్ నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేస్తున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గతంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున ఎండీ డ్రగ్స్ తయారీ కేంద్రాలను గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 25 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో కలిపి 69.871 కిలోల ఎండీ డ్రగ్స్, 260 లీటర్ల ముడి రసాయనాలు, భారీ మొత్తంలో నగదు, ప్రయోగశాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాశమైలారంలో బయటపడిన తయారీ కేంద్రానికి ఇతర ప్రాంతాల్లోని ముఠాలతో ఉన్న సంబంధాలు, డ్రగ్స్ తయారీ వెనుక ఉన్న సూత్రధారులు, ఆర్థిక లావాదేవీలు, అంతర్రాష్ట్ర సరఫరా వ్యవస్థపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ జోరు!

**తొలిప్రభ, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మజ్లిస్ పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. కడప కార్పొరేషన్ మేయర్ పదవితో పాటు హిందూపురం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ స్థానంపైనా పార్టీ దృష్టి సారించింది. విజయవాడ, కడప కార్పొరేషన్లతో పాటు మరో ఐదు మున్సిపాలిటీల్లో మొత్తం 21 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కలిసి ఎన్నికల వ్యూహంపై చర్చించారు. తమ అభ్యర్థులు పోటీ చేస్తే విజయం సాధించే అవకాశాలున్నాయని ఆయనకు వివరించారు. అన్ని స్థానాల్లో పోటీ చేయకుండా గెలుపుపై నమ్మకం ఉన్న వార్డులు, డివిజన్లలో మాత్రమే అభ్యర్థులను నిలపాలని ఒవైసీ సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కడప మేయర్ పదవితో పాటు విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లకు అభ్యర్థులను ఖరారు చేశారు. హిందూపురం ఛైర్‌పర్సన్ స్థానంతో పాటు మరో ఐదు వార్డుల్లోనూ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఆదోనిలోని ఏడో వార్డు, రాయదుర్గంలోని మూడు వార్డులు, పెనుగొండ, నంద్యాల మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డులో మజ్లిస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిని గెలిపించుకునేందుకు హైదరాబాద్ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మాజిద్ హుస్సేన్, మహ్మద్ ముబీన్‌తో పాటు ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు, రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబరు 1న పోలింగ్ నిర్వహించనుండగా, అవసరమైన చోట నవంబరు 2న రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబరు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. తొలుత అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పులు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తొలి విడతకు నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఇచ్చింది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించింది.

## కివీస్‌పై రెండో టీ20లో

# టీమిండియా గెలుపు!

**తొలిప్రభ, హైదరాబాద్:**

భారత్‌న్యూజిలాండ్ జట్ల మధ్య శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా ఉత్కంఠ విజయం సాధించింది. చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన పోరులో యువ బ్యాటర్ తిలక్ వర్మ అర్ధ సెంచరీతో చెలరేగగా, నితీశ్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడి జట్టుకు విజయాన్ని అందించారు. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ 14 పరుగులకు, వైభవ్ సూర్యవంశీ 4 పరుగులకు ఔటయ్యారు. అనంతరం అభిషేక్ శర్మ 27 పరుగులు చేసి వెనుదిరిగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 7 పరుగులకే ఔటవగా, అక్షర్ పటేల్ కూడా వెంటనే పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో నిలిచిన తిలక్ వర్మ వికెట్లు పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టును ఆదుకున్నాడు. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి దూకుడుగా బ్యాటింగ్ చేసి పరుగుల వేగాన్ని పెంచాడు. అయితే 14.5 ఓవర్లలో జట్టు స్కోరు 113 పరుగుల వద్ద నితీశ్ ధీర్ 31 పరుగులు చేసి మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి దూకుడును కొనసాగించాడు. చివరి 30 బంతుల్లో 68 పరుగులు చేయాల్సిన దశలో ఇద్దరు తెలుగువారు అద్భుతంగా ఆడుతూ లక్ష్య ఛేదనను ముందుకు నడిపించారు. తిలక్ వర్మ 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసి కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. చివరి ఓవర్లో భారత్ విజయానికి 11 పరుగులు అవసరమయ్యాయి. ఉత్కంఠ నడుమ తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి లక్ష్యాన్ని ఛేదించేలా బ్యాటింగ్ చేశారు. చివరకు ఒక బంతి మిగిలి ఉండగానే భారత్ 181 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. తిలక్ వర్మ 26 బంతుల్లో 51 పరుగులు చేయగా, నితీశ్ కుమార్ రెడ్డి 13 బంతుల్లో 26 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. ఐదు వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన భారత్‌ను ఇద్దరు యువ ఆటగాళ్లు విజయతీరాలకు చేర్చడంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది.

## జిలెటిన్ స్టిక్స్ పేలి ఐదుగురి దుర్మరణం!

**తరువాయి భాగం**

పనుల నిర్వాహకులు జిలెటిన్ స్టిక్స్ అమర్చారు. అయితే పేలుడు పదార్థాలు ఉన్న ప్రాంతంలోకి వాహనాలు, ఇతరులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణమైందనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్వాహకుల నిర్లక్ష్యం ఐదుగురి ప్రాణాలను బలిగొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారికి చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఊర్కొండ మండలానికి రూ.8 కోట్ల నిధులు

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి మండల ప్రజల కృతజ్ఞతలు**

**తొలిప్రభ: ఊర్కొండ**



మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ఎమ్మెల్యే శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి అన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు మండల ప్రజల తరఫున ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఊర్కొండ మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.8 కోట్ల నిధులు వివిధ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు సమకూర్చుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి ఊర్కొండ మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి పేర్కొన్నారు.

# హామీల శంఖం.. అమలులో శూన్యం!

- 1,052 రోజులైనా నెరవేరని హామీలు.. దత్తత ఆదిలాబాద్‌కు అన్యాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు మజర్ విమర్శలు

**తొలిప్రభ , ఆదిలాబాద్ బ్యూరో:-**




ఆదిలాబాద్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకుడు మజర్ విమర్శించారు. హామీలు ప్రకటించడంలో చూపిన ఉత్సాహం వాటి అమలులో కనిపించడం లేదని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దత్తత తీసుకుంటానని ప్రకటించిన ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**హామీల అమలుపై స్పష్టత ఏదీ?**

2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా కింద ఎకరాకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సాయం, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా వంటి హామీలను ప్రకటించిందని మజర్ గుర్తుచేశారు. ఈ హామీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రాణహిత–చేవెళ్ల, విశ్వవిద్యాలయంపై కార్యాచరణ ప్రకటించాలి**

నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారని మజర్ పేర్కొన్నారు. ఆ ప్రకటనకు అనుగుణంగా జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు, ఆదిలాబాద్‌లో విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**సీసీఐ పునరుద్ధరణతో యువతకు ఉపాధి కల్పించాలి**

ఆదిలాబాద్‌లో సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పునఃప్రారంభం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మజర్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ హబ్ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ, జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సీసీఐ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.

**రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలిచామని మజర్ పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరారు. తలమడుగు మండలంలో అప్పుల బాధ, పెట్టుబడి సాయం అందక ముగ్గురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పేర్కొంటూ, ఈ ఘటనలపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

**హామీలు అమలు చేసి జవాబుదారీగా నిలవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని, తిరిగి కేసీఆర్ నాయకత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మజర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో హామీలు ప్రకటించడం మాత్రమే కాకుండా, వాటిని అమలు చేసి ప్రజలకు జవాబుదారీగా నిలవాలని అన్నారు. దత్తత ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# రోస్టర్ కేటాయింపుల్లో మాలలకు అన్యాయం చేయొద్దు!

**20 రోస్టర్ పాయింట్లలో ఒక పాయింట్ కేటాయించాలని మాల ఐక్యవేదిక డిమాండ్**

**తొలిప్రభ, ఆదిలాబాద్ బ్యూరో**

బోథ్: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అనంతరం చేపట్టిన రోస్టర్ కేటాయింపుల్లో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని, ఈ కేటాయింపులను పునఃసమీక్షించి న్యాయం చేయాలని మాల-మాల ఉపకులాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బోథ్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలోని సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సంబంధిత గణాంకాలను పరిగణనలోకి తీసుకొని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రోస్టర్ కేటాయింపులు చేపట్టాలని కోరారు. ఏ సామాజిక వర్గానికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోస్టర్ విధానంలో ఎస్సీ గ్రూప్-3కు సంబంధించి ప్రతి 20 రోస్టర్ పాయింట్లలో మాల సామాజిక వర్గానికి ఒక పాయింట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు.మాల సామాజిక వర్గ హక్కులను విస్మరిస్తే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ పోరాటం ఏ సామాజిక వర్గానికీ వ్యతిరేకం కాదని, తమ హక్కుల సాధనతో పాటు సమాన అవకాశాల కోసం చేస్తున్న న్యాయమైన పోరాటమని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో కుచులాపూర్ గ్రామ సర్పంచ్ మైలి నారాయణ, పసుల చంటి, కంది ప్రవీణ్, కురుమే గంగాధర్, కోల ప్రశాంత్, నాగార్జున, సాగర్, కుర్మే జానీ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి తాళం పగులగొట్టి వెండి పట్టీలు, నగదు చోరీ - నిందితుడు అరెస్ట్

**తొలిప్రభ, అదిలాబాద్**

వెండి పట్టీలు, రూ.10,130 నగదు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం తలమడుగు SHO డి. రాధిక ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని తలమడుగు పోలీసులు అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తలమడుగు ఎస్హెచ్ఓ డి. రాధిక తెలియజేశారు.

**నిందితుడు:**

మాకల రాజు (35), s/o మాకల సత్యనారాయణ, కేఆర్‌కే కాలనీ, ఆదిలాబాద్. ప్రస్తుత నివాసం: దేవాపూర్ గ్రామం, తలమడుగు మండలం.

**ఘటన వివరాలు:**

ఈ నెల 21వ తేదీ రాత్రి దేవాపూర్ గ్రామంలో శారదాదేవి విగ్రహ నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన అంగ రాజు తన భార్య, పిల్లలతో కలిసి ఊరేగింపుకు వెళ్లాడు. అర్ధరాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. పరిశీలించగా 3 తులాల వెండి పట్టీలు, రూ.15,000 నగదుకనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు తాళమడుగు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల 24వ తేదీ ఉదయం కజ్జర్ల ఎక్స్ రోడ్డు సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని పట్టుకుని విచారించారు. అతడు ఆదిలాబాద్ లోని కేఆర్‌కే కాలనీకి చెందిన మాకల రాజు (35) గా గుర్తించారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి 3 తులాల వెండి పట్టీలు, రూ.10,130 నగదు, హోండా యాక్టివా ద్విచక్ర వాహనం, రెడ్‌మీ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన నగదులో కొంత ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిపై గతంలో కూడా దొంగతనం కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తలమడుగు ఎస్హెచ్ఓ డి. రాధిక మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.



# అమరవీరుని జ్ఞాపకాలు మరువలేనివి

**అమరుడి జ్ఞాపకాలు తెచ్చిన కన్నీళ్లు గురుజావాడలో సురేష్‌కు సిఐ రవి , ఎస్ఐ నరేష్ నివాళులు**

**తొలిప్రభ, సంగారెడ్డి జిల్లా**

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని గురుజువాడ గంజాయి స్మగ్లర్ల చేతిలో దారుణంగా హత్యకు గురైన గురుజావాడ గ్రామానికి చెందిన సురేష్‌కు జహీరాబాద్ సిఐ రవి, కోహీర్ ఎస్సై నరేష్ నివాళులర్పించారు. గురుజావాడలోని సురేష్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అమరవీరుడికి ఘన నివాళి అర్పించారు. 2010వ సంవత్సరంలో నాగూర్ గ్రామ శివారులో గంజాయి స్మగ్లర్ల దాడిలో సురేష్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. సురేష్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.ఆసరాగా ఉన్న కుమారుడిని కోల్పోయి, ఆ జ్ఞాపకాలతోనే జీవిస్తున్నామని కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబానికి అండగా నిలవాలని, వారి న్యాయపోరాటానికి ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ పట్టణ సీఐ రవి, కోహీర్ ఎస్సై నరేష్. వారి సిబ్బంది ఉన్నారు.



# కేశవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ విచారణ

**తొలిప్రభ, మానకొండూర్**

గ్రామపంచాయతీ నిధులు అక్రమాలు జరిగాయని ఓ వ్యక్తి కరీంనగర్ జిల్లా కలెక్టర్ చేయగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని ,కేశవపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి కాసగోని ప్రభాకర్ క్షేత్రస్థాయి విచారణ చేశారు. ఈ సందర్భంగా విచారణ అధికారి ప్రభాకర్ మాట్లాడారు కేశవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం అక్రమాలు జరిగాయని గ్రామానికి చెందిన అన్నారపు తిరుపతి 3/8/2026 రోజున ఫిర్యాదు చేయగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి కి విచారణకు ఆదేశించగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు కేశవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో క్షేత్రస్థాయి విచారణ ను నిర్వహించి పూర్తి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం నుండి, సమాచారాన్ని సేకరించడం జరిగినట్లు పేర్కొన్నారు తన విచారణలో వెల్లడైన ప్రతి విషయాన్ని ,నివేదికలు తయారు చేసి, ఉన్నతాధికారులకు అందజేస్తానని విచారణ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఈ విచారణలో గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నరసయ్య తదితరులు ఉన్నారు.

# రేవల్లి గేట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**తొలిప్రభ ఊరుకొండ**



ఊరుకొండ మండలం: రేవల్లి గేట్ సమీపంలో నిన్న రాత్రి సుమారు 9 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే లేదా అతని వివరాలు తెలిసినట్లయితే ఉరుకొండ పోలీస్ స్టేషన్: 8712657754 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.



# మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన స్రవంతి రెడ్డి

**తొలిప్రభ,జహీరాబాద్**

జహీరాబాద్. విజయదశమి ప్రయోజనాన్ని పురస్కరించుకొని టిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు అయినా మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి లతో కలిసి శనివారం నాడు పిచరేగాడి సహకార బ్యాంకు చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు స్వగృహానికి వెళ్లి వారికి విజయదశమి శుభాకాంక్షలు తెలపడం జరిగింది . అదేవిధంగా మాజీ మంత్రికి బొకేతో సత్కరించి శాలువా కప్పినారు.. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మహిళా నాయకులకు వారి యొక్క యోగక్షేమలోకి తెలుసుకున్నా అనంతరం వారి కూడా విశాలలతో కప్పి పర్వదిన శుభాకాంక్షలు తెలిపినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమి పర్వదినం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపి కర్షకులు కార్మికులు రైతులు జీవితాల్లో సుఖ సంతోషాలు ప్రసాదించాలని వ్యాపారవేత్తలు లాభాలు పట్టాలని వారు అన్నారు. కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు మాలోత్ కవిత, పిచారేగాడి సహకార బ్యాంకు చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి, మాజీ జడపిటిసి లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారుల ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్
- కొత్తగట్టు టోల్ ప్లాజా ను సందర్శించిన కరీంనగర్ సిపి గౌస్ ఆలం

**తొలిప్రభ, కరీంనగర్ బ్యూరో**




కొత్తగట్టు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాను పరిశీలిస్తున్న కరీంనగర్ సిపి గౌస్ ఆలం

వాహనదారుల ప్రయాణికుల రక్షణ ధ్యేయంగా టోల్ ప్లాజా నిర్వాహకులు రహదారి భద్రతలను పాటించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం టోల్ ప్లాజా నిర్వాహకులను సిబ్బందిని ఆదేశించారు. శనివారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకర పట్నం మండలంలోని కొత్తగట్టు శ్రీ మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం సమీపంలో నూతనంగా నిర్మించిన వరంగల్ , కరీంనగర్ జాతీయ రహదారి ఎన్ హెచ్ 563 పై ఏర్పాటుచేసిన టోల్ ప్లాజా ను సిపి గౌస్ అలం క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ యూనిట్, టోల్ ప్లాజా అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను, సీసీ కెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థ, కంట్రోల్ రూమ్ ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.రహదారిపై ఏవైనా రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సమాచారం అందుకునే వ్యవస్థ, కంట్రోల్ రూమ్ నుంచి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకునే విధానం, బాధితులకు వేగంగా వైద్య సహాయం అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడైన ప్రమాదం జరిగితే క్షతగాత్రులను కాపాడేందుకు గోల్డెన్ అవర్లో తక్షణమే స్పందించి, ఆసుపత్రులకు తరలించే సమన్వయ వ్యవస్థ పక్కాగా ఉండాలన్నారు.సీసీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షిస్తూ, మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు. హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీలలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి, హైవే అథారిటీ ప్రతినిధులు, టోల్ గేట్ నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.



# సంగారెడ్డి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షునికి ఘన సన్మానం

**తొలిప్రభ,జహీరాబాద్**

తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొనదొడ్డి నరసింహ అన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాలతో నిరంతరం పోరాడుతున్న నరసింహను సంగారెడ్డి జిల్లా యువకులు ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన నరసింహ.. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం మరియు ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేసిన నరసింహ, త్వరలోనే తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణాల నాయకులకు అధిక ప్రాధాన్యతనిస్తూ బడుగు బలహీన వర్గాల నాయకులను అణగదొక్కుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎప్పుడు వెనుకడుగు వేయబోదన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుని స్థానంలో ఉన్న తాను తెలంగాణ ప్రజల్లో సామాజిక చైతన్యం తేవడంలో తన వంతుగా ప్రతిక్షణం పనిచేస్తానని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కులాలకు సరియైన న్యాయం చేయాల్సిన బాధ్యత తమ పార్టీపై ఉందన్నారు. అదేవిధంగా అగ్రవర్ణాల పేద ప్రజలకు తమ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల ద్వార ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. నైతిక విలువలను పాటిస్తూ యువతకు మరియు భవిష్యత్ తరాలకు బంగారు బాట తమ పార్టీ చూపుతుందని, తర తరాల నుంచి వస్తున్న బానిసత్వానికి చరమగీతం పాడే రోజులు ముందున్నాయని నరసింహ ఆశాభావం వ్యక్తం చేశారు. తనను సన్మానించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, తన చిన్ననాటి స్నేహితుడైన బళ్ళు బలరాం తనను ఘనంగా పూలమాల శాలువలతో సన్మానించడం గొప్ప గౌరవమని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుని సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, బళ్ళు గ్యారేజ్ సభ్యులు మరియు సంగారెడ్డి జిల్లా యువకులు పాల్గొన్నారు



# మహిళా సమైక్య భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన డిఆర్డిఓ పిడి గీత

**తొలిప్రభ, మానకొండూర్**

మహిళా సమైక్య భవన నిర్మాణానికి స్థలాన్ని శనివారం పరిశీలించినట్లు కరీంనగర్ డిఆర్డిఓ పిడి మచ్చ గీత తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరా పట్నం మండలం మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఆర్డిఓ పిడి గీత మాట్లాడుతూ మొలంగూర్ గ్రామంలోని మహిళా సమైక్య భవన నిర్మాణానికి గ్రామపంచాయతీ సమీపంలో గల పసుపు బొంద వద్ద భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సోమవారం రెవెన్యూ సర్వేయర్ క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, భవన నిర్మాణానికి స్థలాన్ని ఏర్పాటు చేసి, హద్దులు, నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూదరి రాజు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కవ్వంపల్లి రాములు, గ్రామ రెవెన్యూ అధికారి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి గురువయ్య, కారోబార్ దాసరి మొగిలయ్య, సిబ్బంది ఉన్నారు.



# శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**తొలిప్రభ. పరిగి :**

దోమ మండలం గూడూరు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పరిగి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్నినో ప్రభావంతో కరువు - నాయకులు, అధికారులు ఆదర్శంగా నిలవాలి

**తొలిప్రభ. పరిగి :**



దోమ : ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వచ్చిన కరువు పరిస్థితుల వల్ల రాజకీయ నాయకులు రానున్న నాలుగు నెలలు వారి వారి జీతభత్యాలు తీసుకోకుండా ప్రజాసేవ చేస్తూ, సామాన్య మానవులకు ఆదర్శంగా నిలవాలని దోమ రైతు ఆనంతరెడ్డి కోరారు.అదేవిధంగా ప్రతి ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు సగం జీతం తీసుకుని..సామాన్య ప్రజలతో పాటు రైతులను ఆదుకోవాలని కోరికను వ్యక్తం చేశారు.కరువు కారణంగా రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ పాలకులు, అధికారులు త్యాగం చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు జీతాలు వదులుకోవడం ద్వారా ప్రజల్లో భరోసా కల్పించాలని సూచించారు.



# సార్లరావులపల్లి శ్రీశ్రీశ్రీ అఘోర కాళీ దేవాలయం భూమి పూజ శంకుస్థాపన, హోమం మహోత్సవం

**శ్రీ శ్రీ శ్రీ ఆచార్య మహా మండలేశ్వర అఘోర గురు మణికందన్ మహారాజ్ చేతుల మీదుగా భూమి పూజ**

**తొలిప్రభ మహేశ్వరం**

రంగారెడ్డి జిల్లా, కందుకూరు సార్లరావులపల్లి గ్రామంలో సార్లపల్లి పెద్దమ్మ తల్లి ఆలయం పక్కన నూతనంగా నిర్మించతలపెట్టిన "శ్రీ అఘోర కాళీ దేవాలం భూమి పూజ, హోమం మరియు శంకుస్థాపన మహోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా...శ్రీ శ్రీ శ్రీ ఆచార్య మహామండలేశ్వర్ అఘోరగురు డాక్టర్ మణికందన్ మహారాజ్ లో అఘోర కాళీ మాత దేవాలయ నిర్మాణానికి, శంకుస్థాపన, భూమి పూజ.. చేశారు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సార్లరావుపల్లి గ్రామం... శ్రీ శ్రీ శ్రీ ఆచార్య మహా మండలేశ్వర అఘోర గురు మణికందన్ మహారాజ్ (అఘోరి అఖారా అధిపతి) ఆధ్వర్యంలో సార్లరావుపల్లి గ్రామంలో అఘోర కాళీ మాత దేవాలయ నిర్మాణానికి, శంకుస్థాపన, భూమి పూజ, మహా హోమ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు... లోక కల్యాణం, సనాతన ధర్మ ప్రచారం, భక్తులలో ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించడం కోసం ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు... శంకుస్థాపన మహోత్సవంలో భాగంగా భూమి పుత్రుడైన వాస్తు పురుషుడికి ప్రత్యేక భూమి పూజ, అఘోర కాళీ మాతకు శక్తివంతమైన హోమాలు, త్రిశూల ప్రతిష్ఠాపన వంటి వైదిక, తాంత్రిక పూజా విధానాలను గురుదేవుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు... ఆచార్య మణికందన్ మహారాజ్ నేతృత్వంలో అస్సాంలోని మాయాంగ్ (జగిరోడ్) లోని అఘోరి అఖారా ఆశ్రమంలోనూ, కర్ణాటకలోని ముధోల్ ప్రాంతంలోనూ వివిధ కాలాల్లో ఇలాంటి దివ్య అఘోర కాళీ ఆలయ నిర్మాణ పనులు, ప్రాణ ప్రతిష్ఠలు జరిగాయి. అన్నారు... ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అఘోర గురు మణికందన్ మహారాజ్ గారి ఆశీస్సులు అందుకుని, కాళీ మాత కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ సంతోష్ కీర్తి ప్రవీణ్ నాయక్ బంజారా సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు...





# గుడాటి పల్లె చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

**సి బి యజమానిపై కేసు నమోదు చేయాలి**

**తొలిప్రభ, మానకొండూర్**

చెరువులో మట్టిని అక్రమంగా తవ్వకం చేపట్టిన జెసిబి యజమానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గుడాటి పల్లె గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకర పట్నం మండలంలోని గుడాటి పల్లె గ్రామంలో చెరువులో శనివారం అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి మొలంగూర్ గ్రామంలో ట్రాక్టర్ల ద్వారా విక్రయించుకొని జెసిబి యజమాని సొమ్ము చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వకం చేపట్టిన జెసిబి ని గుర్తించి జెసిబి యజమానిపై చట్టపరంగా న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.



# పత్తి రైతన్న ఘోష వినేది ఎవరు

**జహీరాబాద్ నియోజకవర్గ పత్తి రైతులను ఆదుకోవాలి — వై. నరోత్తం డిమాండ్**

**తొలిప్రభ,జహీరాబాద్**

జహీరాబాద్ నియోజకవర్గం లో పత్తి పంట పొలాలను పరిశీలించిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం గారు. ఈ సందర్భంగా పత్తి పంట పరిస్థితిని,దిగుబడి అవకాశాలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో మాట్లాడి తెలుసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ,ప్రతికూల వాతావరణ పరిస్థితులు, దిగుబడుల తగ్గుదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో పత్తి రైతులకు సాగు ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని అన్నారు గత ఏడాది తెలంగాణలో సుమారు 44.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతుల అంచనా. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం సుమారు 45.95 లక్షల ఎకరాలకు పెరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.
దుక్కులు దున్నడం,విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు, ఇతర వ్యవసాయ పనులు, పత్తి ఏరడం తదితర ఖర్చులు కలిపి ఎకరాకు సుమారు రూ.48,000 అవుతున్నాయి
ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చి, క్వింటాలుకు రూ.8,667 చొప్పున ధర లభించినా రైతుకు వచ్చే ఆదాయం కేవలం రూ.34,668 మాత్రమే. ఈ లెక్కన ఎకరాకు రూ.13,332 నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.
జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 43,352 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని, దాదాపు 22,940 మంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు,
ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్.
రైతులు పంట పండించడానికి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, చివరకు నష్టాలతో అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని . పత్తి రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, జహీరాబాద్ ప్రాంతంలోని వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, యం. మల్లేశం,వీర్ సంగప్ప.చెంగల్ జైపాల్,లక్ష్మి నారాయణ,బి. తుక్కన్న,యం. డి.రైసోద్దీన్, బి.రాములు,కే.మల్లేశం, తదితరులు ఉన్నారు



## పాటూరి సీడ్ ఎదుట రైతుల ఆందోళన

**కేశవ పట్నం ఎస్సై శేఖర్ రెడ్డి చర్చలతో శాంతించిన రైతులు**

**తొలిప్రభ, కరీంనగర్ బ్యూరో**

పాటూరి సీడ్ ప్లాంట్ ఎదుట శనివారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం దబ్బేట గ్రామంలో గౌస్ అనే ఆర్గనైజర్ 60 ఎకరాలకు పాటూరి సీడ్ యాసంగి పంట సాగు కు ఆడ మగ వరి విత్తనాలు పంపిణీ చేశారని, పంట విత్తనము నాటే సమయంలో గౌస్ 15 కింటాలు ఎకరాకు పంట వస్తుందని తెలిపాడని, తీరా ఎకరాకు 50 కిలోల నుండి 100 కిలోల వరకే దిగుమతి రావడంతో నష్ట పరిహారం ఇస్తామని చెప్పిన ఆర్గనైజర్ గౌస్, తమకు నేటి వరకు నష్టపరిహారం డబ్బులు చెల్లించకపోవడంతో, కేశవపట్నం శివారులోని పాటూరి సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళన నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా తమకు రావలసిన పంట డబ్బులు ఇప్పించాలని అధికారులను కోరారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి చరవాణి ద్వారా రైతులతో మాట్లాడి కేశవపట్నం పోలీస్ పోలీస్ స్టేషన్ లో రైతులతో చర్చలు జరిపి శాంతింప చేశారు. రైతులు ఎస్సై శేఖర్ రెడ్డిని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది రైతులు ఆర్గనైజర్ గౌస్ ఉన్నారు.





## భవిష్యత్తులో విద్యుత్, నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి:స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్

**తొలిప్రభ అదిలాబాద్**

భవిష్యత్తులో తలెత్తే విద్యుత్, నీటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన హోటళ్లు, రెస్టారెంట్లు, కార్ వాషింగ్ సెంటర్లు, వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాబోయే రోజుల్లో విద్యుత్, తాగునీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. పెద్ద వ్యాపార వర్గాలు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులు, అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తమ లోడ్ ఫ్యాక్టర్‌కు అనుగుణంగా సోలార్ ప్లాట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పగటిపూట సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని, గ్రిడ్ విధానం ద్వారా బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇందుకు బ్యాంకర్లు కూడా పూర్తి సహకారం అందిస్తూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున నీటి వృథాకు వెంటనే అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, కార్ వాషింగ్ సెంటర్లు, వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నీటిని వృథా చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నిబంధనలు పాటించని కార్ వాషింగ్ కేంద్రాలు, ఇతర వ్యాపార సంస్థలపై భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, రాబోయే ఆరు నెలల్లో తాగునీటి వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నీటిని పొదుపుగా వాడి కొరతను నివారించడంలో ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ డిఈ సందీప్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్ కుమార్,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





## బాచుపల్లి మమతా హాస్పిటల్‌లో దారుణ ఘటన

- **వైద్యం వికటించి మహిళ మృతి..?**
- **వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆగ్రహం..?**

**తొలిప్రభ, కుత్బుల్లాపూర్**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి మమతా హాస్పిటల్‌లో దారుణం చోటు చేసుకుంది. వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ మృతిచెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతురాలి బంధువులు తెలిపిన సమాచారం ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన కాసమ్మ(30) అనే మహిళ మూడు రోజుల క్రితం మోకాళ్ళ శస్త్రచికిచ్చ కోసం బాచుపల్లి మమతా హాస్పిటల్‌లో చేరిందని, మూడు రోజులుగా ఆమెకు వైద్యులు చికిత్స నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. శనివారం ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో కాసమ్మ మరణించినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం.

**మృతురాలి బంధువుల ఆందోళన**

దీంతో కోపోద్రిక్తులైన బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 100 మందికి పైగా చేరుకుని మమతా హాస్పిటల్ ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే కాసమ్మ మృతిచెందిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. మోకాళ్ళ చికిచ్చ కోసం కాసమ్మ వస్తే కడుపు నొప్పి ఉందని చికిత్స చేశారని, వైద్యులు తప్పించుకునే ప్రయత్నం చేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మమతా హాస్పిటల్ ముందు రాత్రి వరకు మృతురాలి బంధువులు ఆందోళన కొనసాగించారు.



## ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ పొదుపుగా వాడాలి

**సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**తొలిప్రభ, కల్వకుర్తి**

నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. రైతులు కూడా పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై దృష్టి సారించాలని అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సులోచన అధ్యక్షతన నిర్వహించిన మండల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను సమర్పించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు. అజిలాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 154లో ఉన్న ప్రభుత్వ భూమికి పట్టాలు ఎలా జారీ చేస్తారని ప్రశ్నిస్తూ సంబంధిత అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు కాకుండా ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరు చేస్తున్నారని కొందరు సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని సర్పంచులు రమేష్ గౌడ్, శ్రీనివాసులు సభ దృష్టికి తీసుకురావడంతో సమావేశంలో కొంత చర్చ జరిగింది. ఈ అంశంపై స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎల్ 1 జాబితాలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సూచించారు. చెర్కూరుకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పెండింగ్‌లో ఉంచి పరిశీలించాలని ఎంపీడీవో సులోచనకు సూచించారు. ఎలినోని ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితులలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని రానున్న రోజులలో నీటి సమస్య తీవ్రతరం కావచ్చు అని ఎమ్మెల్యే సూచించారు. రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని వ్యవసాయంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. గతంలో రాష్ట్రంలో 13వేల మెగావాట్ల విద్యుత్ వినియోగంలో ఉండగా ప్రస్తుతం సుమారు 20వేల మెగావాట్లకు చేరిందని ఎమ్మెల్యే తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరు విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలినోని ప్రభావం పై శాస్త్రవేత్తలు చేస్తున్న హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయశ్రీ, తహసిల్దార్ కార్తీక్ కుమార్, డివిజన్ రైతు సమన్వయ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, విద్యుత్ ఏడి శంకరయ్య, పంచాయతీ రాజ్ ఏడి బసవలింగం, సిఐ రఘువీర్ రెడ్డి, సర్పంచులు మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, భాగ్యమ్మ, శారద హరికిషన్ నాయక్, రమేష్ నాయక్, శారద చెన్నయ్య, ముక్తాల రమేష్, సంగీత శేఖర్ రెడ్డి, రవీందర్ నాయక్, బద్రి, తారా సింగ్, సామ వెంకటయ్య, దన్ సింగ్ నాయక్, మమత లక్ష్మణ్ స్వామి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌కు గురైన పారిశుద్ధ్య కార్మికుడికి రూ.15 వేల ఆర్థిక సహాయం



**బాధితుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించిన జక్కుల చిన్న జంగయ్య యాదవ్**

**తొలిప్రభ, కల్వకుర్తి**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న అంకమోనికుంట గ్రామానికి చెందిన రమేష్ నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేష్‌ను శనివారం జియాగూడ యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ హాస్పిటల్ కు వెళ్లి రమేష్‌ను పరామర్శించారు. రమేష్ కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆపదలో ఉన్న బాధితుడికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన జక్కుల చిన్న జంగయ్య యాదవ్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి సత్తూరి ఆంజనేయులు గౌడ్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొని రమేష్‌ను పరామర్శించారు.



## రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి

**తొలిప్రభ. పరిగి :**

పరిగి పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల కొనుగోలును సజావుగా నిర్వహించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు.ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడే కరువును రాజకీయాలకు ముడిపెట్టి ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో రాజకీయ విమర్శలు చేయడం కంటే, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి



**శ్రీనిధి రీజనల్ మేనేజర్ మదర్**

**తొలిప్రభ, మానకొండూర్**

మహిళా సంఘ సభ్యులు శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలను పొంది ఆర్థికంగా ఎదగాలని శ్రీనిధి రజనల్ మేనేజర్ ఎస్.కె మదర్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం కేంద్రంలోని వెలుగు సమైక్య భవనంలో శ్రీనిధి రుణాలపై ఐకెపి సీసీ, సిబ్బంది. తో సమావేశాన్ని ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మదర్ మాట్లాడారు. మహిళా సంఘం సభ్యులు తీసుకున్న శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించేందుకు మహిళలకు పూర్తి అవగాహన కల్పించి, శ్రీనిధి రుణాలు సకాలంలో ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ ను పూర్తిచేయాలని సూచించారు. శంకరపట్నం మండల పరిధిలో శ్రీనిధి రుణాల చెల్లింపు పై రీజినల్ మేనేజర్ మదర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్ సీసీలు , కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నిత్యావసరాల ధరల భారం.. ఎల్‌నినోపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.. నీటి వృథాను అరికట్టాలి
- తెలంగాణ రాష్ట్ర మహాజన రచయితల సమాఖ్య రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. విజయ భాస్కర్

**తొలిప్రభ, హైదరాబాద్:**

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర మహాజన రచయితల సమాఖ్య రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. విజయ భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ముఖ్యంగా రెక్కాడితే గానీ డొక్కాడని దినసరి కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిత్యావసర ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు**

బియ్యం, పప్పుదినుసులు, వంటనూనె, ఉల్లిగడ్డలు, వెల్లుల్లి, పసుపు, కారం, ఆకుకూరలు, కూరగాయలతో పాటు మేక మాంసం, కోడి మాంసం, చేపల ధరలు పెరగడంతో సామాన్యులు వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందని విజయ భాస్కర్ తెలిపారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందన్నారు. మార్కెట్‌లో ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొన్ని నిత్యావసర వస్తువులను వ్యాపారులు నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ధరలు పెంచే అవకాశాలపై అధికారులు నిఘా పెట్టాలని కోరారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, దినసరి కూలీలకు అందుబాటు ధరల్లో నిత్యావసర వస్తువులు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా బియ్యం, వంటనూనె, ఉల్లిగడ్డలు, పప్పుదినుసులు వంటి వస్తువులను చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎల్‌నినో ప్రభావంపై అవగాహన అవసరం**

ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున నీటి కొరత, విద్యుత్ సరఫరా అంతరాయాలు, వ్యవసాయంపై ప్రభావం వంటి అంశాలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత శాఖల ద్వారా ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని కోరారు. బాసరలోని ట్రిపుల్ ఐటీలో దసరా సెలవులను పొడిగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం విద్యా సంస్థల నిర్వహణపై ఏ విధంగా ఉంటుందనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల మంత్రులు, అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యాసంస్థల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి వృథాను అరికట్టాలి**

నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విజయ భాస్కర్ పేర్కొన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం, నీటి ఎద్దడి వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవని అన్నారు. అందువల్ల నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వాహనాలను శుభ్రం చేసే పేరుతో అధికంగా నీటిని వృథా చేయవద్దని, సాధ్యమైనంత వరకు తడిగుడ్డతో వాహనాలను శుభ్రం చేసుకోవాలని కోరారు. బోర్ల ద్వారా నీటిని వినియోగించే వారు అవసరానికి మించి నీటిని తోడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో విచ్చలవిడిగా బోర్లు వేయడాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్లు నీటి పొదుపుపై జారీ చేస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా చూడాలని కోరారు. పగిలిపోయిన నీటి పైపుల నుంచి నీరు వృథాగా ప్రవహిస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అటువంటి సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే అవసరం లేని సమయాల్లో వీధి దీపాలను ఆర్పివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయాలని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగం, నిత్యావసర ధరల నియంత్రణ వంటి అంశాలపై అధికార, ప్రతిపక్ష నాయకులు రాజకీయాలకు అతీతంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని డాక్టర్ ఎస్. విజయ భాస్కర్ కోరారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు వివరించాలని సూచించారు.

ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించడం, విద్యుత్ వృథాను అరికట్టడం, పర్యావరణ పరిరక్షణకు సహకరించడం వంటి బాధ్యతలను నిర్వర్తించాలని అన్నారు. అదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.



డాక్టర్. ఎస్. విజయ భాస్కర్



# సినీ సవ్వడి

## 'ఆకాశంలో ఒక తార' నుంచి బిజిలీగా రుహానీ శర్మ ఫస్ట్ లుక్ రిలీజ్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో ముఖ్యమైన పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. ఈ సినిమాలో బిజిలీగా నటిస్తున్న రుహానీ శర్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కిటికీ పక్కన కూర్చుని కనిపిస్తున్న ఆమె సంప్రదాయ దుస్తుల్లో సింపుల్‌గా, అందంగా ఆకట్టుకున్నారు. ఫ్లజెంట్ ప్రెజెంటేషన్‌లో రుహానీ సహజమైన అందంతో మెరిసింది. బిజిలీ పాత్ర సినిమాలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందనే ఆసక్తిని ఈ ఫస్ట్ లుక్ పెంచుతోంది. అనుకోని సమయంలో కథలోకి ప్రవేశించి, అప్పటివరకు సాగుతున్న ప్రయాణానికి కొత్త వెలుగును తీసుకొచ్చే పాత్రగా బిజిలీని మేకర్స్ పరిచయం చేశారు. అనుకోకుండా ఎదురయ్యే ఓ పరిచయం.. ఆ ప్రయాణంలో ఊహించని అందమైన అనుభూతులను తీసుకొస్తుంది. ఇటీవల విడుదలైన 'ఆకాశంలో ఒక తార' టీజర్‌కు మంచి ఆసక్తి నెలకొంది. పెద్ద కలలతో ముందుకు సాగాలనుకునే ఓ పల్లెటూరి అమ్మాయి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. తన కలలను నిజం చేసుకునే ప్రయాణంలో హీరో ఆమెకు అండగా నిలుస్తాడు. భావోద్వేగాలకు ప్రాధాన్యమిస్తూ, ఆశయాలు, అనుబంధాల నేపథ్యంలో ఈ సినిమా సాగనున్నట్లు టీజర్ సూచించింది. ఈ చిత్రానికి సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని 2026 నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## అదంతా అబద్ధం... తమన్నా భలే చెప్పిందే!

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. ఆఫర్లు రాని సమయంలో కృంగిపోకుండా, వరుసగా ఆఫర్లు వస్తున్న సమయంలో చిన్న సినిమాలను వదిలేయకుండా కెరీర్‌ను బ్యాలన్స్ చేస్తూ వచ్చింది కనుకే ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఇరవై ఏళ్ల తర్వాత కూడా తమన్నా బిజీగా ఉందనే విషయాన్ని ఈ తరం నటీనటులు అర్థం చేసుకోవాలి. వరుస ఫ్లాప్స్ పడ్డప్పుడు కేవలం హీరోయిన్‌గానే సినిమాలు చేస్తానంటూ భీష్మించుకు కూర్చోలేదు, ఐటెం సాంగ్స్ నుంచి మొదలుకుని మ్యూజిక్ వీడియోలు, వెబ్ సిరీస్‌లను సైతం తమన్నా చేయడం వల్లే ఇంకా ఇండస్ట్రీలో కొనసాగుతుంది అనడంలో సందేహం లేదు. పెద్దగా బ్యాక్ గ్రౌండ్ లేకుండా, తన కెరీర్‌ను తానే బిల్డ్ చేసుకున్న తమన్నాను చూసి చాలా మంది చాలా విషయాలు నేర్చుకోవాలని, ముఖ్యంగా ఈతరం హీరోయిన్స్ తమన్నాను ఆదర్శంగా తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.తమన్నా ఇటీవలే ది వ్యాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమాకు నెగెటివ్ రివ్యూలు వచ్చినా ప్రేక్షకుల నుంచి పాజిటివ్ మౌత్ టాక్ రావడంతో డీసెంట్ వసూళ్లు రాబట్టి హిట్ జాబితాలో చేరిందని బాలీవుడ్ వర్గాల వారు అంటున్నారు. ప్రస్తుతం తమన్నా చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాదిలో తమన్నా నటించిన సినిమాలు మంచి స్పందన దక్కించుకున్న నేపథ్యంలో వచ్చే ఏడాది వచ్చే ఆమె సినిమాలకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఏడాది పాజిటివ్ హోప్ తో ప్రారంభించే తమన్నా ఇటీవల ఒక చిట్ చాట్ లో చెప్పిన విషయంను జీవిత సత్యం అంటూ చాలా మంది సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇలాంటివి కొద్ది మంది మాత్రమే, అది కూడా గొప్ప వ్యక్తిత్వం, లోతుగా ఆలోచించే వారు మాత్రమే చెప్పగలరు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.ఇంతకు తమన్నా ఏమన్నదంటే... మంచి అవకాశాల కోసం, సరైన అవకాశాల కోసం ఎదురు చూడటం వల్ల విజయం దక్కదు, కొత్త విషయాలను నేర్చుకోలేము. అత్యుత్తమ అవకాశం కోసం ఎదురు చూడటం అనేది పెద్ద అబద్ధం. అలా ఎదురు చూడటం వల్ల సమయం వృథా అవుతుంది తప్ప విజయాలు దక్కవు. నేను కెరీర్ ఆరంభంలో గొప్ప నటిని కాదు, గొప్ప డాన్సర్‌ను అసలే కాదు. పుట్టుకతో గొప్ప వ్యాపారవేత్తను కూడా కాదు. జీవితంలో మనం మన పని చేసుకుంటూ వెళ్తున్న సమయంలో తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయి, తద్వారా చాలా విషయాలు నేర్చుకుంటాం, అంతే కాకుండా గొప్ప విజయాలు నమోదు అవుతాయని తమన్నా చెప్పుకొచ్చింది. మనం చేసే పనితో అనుభవం దక్కుతుంది, ఆ అనుభవం చాలా విషయాలను నేర్పిస్తుంది. అంతే తప్ప అవకాశాల కోసం ఎదురు చూడటం వల్ల ఏం నేర్చుకోలేమని తమన్నా పేర్కొంది.